# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశం కానుంది.
2. కేంద్ర ప్రభుత్వం చేపట్టే జన గణనలో కులగణనను చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కోరారు.
3. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈరోజు కృష్ణా జిల్లాలో జరిగే ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొంటారు.
4. ఆంధ్రప్రదేశ్‌లోని నగరపాలక సంస్థల్లో స్వీపింగ్ మిషన్ల ద్వారా చెత్తను తొలగించే ప్రక్రియను అమలు చేస్తామని మంత్రి పి. నారాయణ వెల్లడించారు.
5. తెలంగాణలో మ్యాప్ లేని గ్రామాల కోసం చేపట్టిన తొలి విడత పునఃసర్వేను పూర్తి చేశామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించడంతో పాటు ఆమోదం కూడా తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఐటీ రంగ విధానాలు, రాజధానిలో రెండో దశ భూ సేకరణపై మంత్రి వర్గం చర్చించనుంది. అలాగే రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు –ఎస్ఐపీబీ సమావేశాల్లో అమోదం తెలిపిన పెట్టుబడులకు మంత్రి వర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

-------------------------

ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వైద్యారోగ్య శాఖ పనితీరు, వైద్య కళాశాల నిర్మాణం వంటి అంశాలపై ముఖ్యమంత్రి గత సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ… ప్రజల వైద్య ఖర్చు తగ్గాలంటే ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని తెలిపారు. యోగా అభ్యాసానికి ప్రాధాన్యత కల్పించేందుకు యోగాధ్యయన పరిషత్ పునరుద్ధరించాలని సూచించారు. పిల్లల్లో పోషకాహార లోపాలు గుర్తించి కేర్ అండ్ గ్రో విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం చేపట్టే జన గణనలో కులగణనను కూడా చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి గత సాయంత్రం పాత్రికేయులతో మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభ ఆమోదించిన బిల్లులకు చట్టబద్ధత కల్పించాల్సిన అవసరముందని అన్నారు. దేశవ్యాప్తంగా జరిపే కులగణన సేకరణకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అనుసరించిన విధానాన్ని వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి తెలియజేస్తూ..

వాయిస్ 33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈరోజు కృష్ణా జిల్లాలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా ఉంగుటూరు మండలం, ఆత్కూర్‌లోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో నిర్వహించనున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా డిగ్రీ పట్టాలతోపాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలను ప్రదానం చేయనున్నారు. గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నగరపాలక సంస్థల్లో స్వీపింగ్ మిషన్ల ద్వారా చెత్తను తొలగించే ప్రక్రియను అమలు చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. నెల్లూరు నగరంలో ఆధునికరించిన పార్కులను మంత్రి గత సాయంత్రం ప్రారంభించారు. అమృత్ పథకం కింద స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

ఆంధ్ర “గ్రంథాలయ పితామహుడు”గా పేరుగాంచిన అయ్యంకి వెంకటరమణయ్య జయంతి ఈ రోజు. తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా కొంకుదురు గ్రామంలో 1890 జూలై 24వ తేదీన ఆయన జన్మించారు. 1934-48 సంవత్సరాల మధ్య కోస్తాంధ్ర ప్రాంతంలో అనేక గ్రంథాలయాలు నెలకొల్పిన ఆయన విజయవాడలోని రామమోహన్ పుస్తక భాండాగారానికి కార్యదర్శిగా వ్యవహరించారు. గ్రంథాలయోద్యమానికి వెంకటరమణయ్య చేసిన కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. దేశంలో పూర్తి స్థాయిలో గ్రంథాలయాలను నెలకొల్పిన వ్యక్తిగా పేరు పొంది... “ప్రజా గ్రంథాలయమే- ప్రజల విశ్వవిద్యాలయం” అని చాటి చెప్పిన అయ్యంకి వెంకటరమణయ్య 1979 మార్చి 7వ తేదీన తుది శ్వాస విడిచారు.

---------------------------

కృత్రిమ మేధ-ఏఐ ద్వారా సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు యాప్ రూపొందించనున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడలో జిల్లాల బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. బీసీ వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా మంత్రి

సవిత పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఇంగ్లాండ్‌లోని మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగవ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో నిన్న భారత జట్టు 4 వికెట్లకు 264 పరుగులు చేసింది. రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్ చేస్తున్నారు. ఈరోజు కూడా మ్యాచ్ కొనసాగనుంది.

---------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ...

వాయిస్..20 సెకన్లు

మరోవైపు తెలంగాణలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కొమురం భీం, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

---------------------------

పన్ను వ్యవస్థ పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు ఆదాయ పన్ను దినోత్సవం నిర్వహిస్తున్నారు. బ్రిటిష్ ఆర్థికవేత్త జేమ్స్ విల్సన్ 1860వ సంవత్సరం జులై 24వ తేదీన ఆదాయం పన్ను నిబంధన ప్రవేశపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా జూలై 24వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం 2010 జూలై 24వ తేదీ నుండి ఆదాయం పన్ను దినోత్సవాన్ని ఆయకర్ దివస్ పేరుతో నిర్వహిస్తోంది. ఆదాయం పన్ను దినోత్సవం సందర్భంగా దేశంలో పన్ను చెల్లింపు వ్యవస్థ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారు సక్రమంగా పన్నులను చెల్లించేలా ప్రోత్సాహించే ఉద్దేశ్యంతో ఆదాయం పన్ను శాఖ ఈ రోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

=====================